# నిర్ణయం

— కె. శ్రియారమ్మ

"నారాయడు సీరియస్, స్టార్ట్ ఇమ్మీడియట్లీ!" టెలిగ్రాం అందుకుని క్షణకాలం ఆశ్చర్యంలో మునిగిపోయాను.

"నారాయడు ఎవరో ఎంతకీ గుర్తురాలేదు!" ఎంతసేపో నా హృది గతం వర్తమానాలమధ్య కొట్టుమిట్టాడింది.

మరోసారి అడ్రను చూశాను.

అది విశాఖపట్నం నించి వచ్చింది.

"విశాపట్నంలో నారాయడు ఎవరు?" నాకు తెలిసిన నారాయడల్లా, మా చిన్నతాతయ్యగారి పాలేరు మాత్రమే. వాడికీ విశాఖపట్నానికీ ఎలాటి సంబంధం లేదు.

మా చిన్నతాతయ్య వెంకటాచలంగారి ఊరుకొండములగాం. అది కూడా శ్రీకాకుళంజిల్లా రణస్థలం దగ్గర వుంది.

పట్నం ఛాయలే తెలియవు ఆ నారాయడుకి. మరి ఈ నారాయడు ఎవరు? బహుశా అడ్రను తప్పేమో? నా పేరుగల వాళ్లెవరయినా వున్నారేమో?

అమ్మా నాన్న ఎంతగానో భయపడ్డారు. "ఎక్కడనించి రజనీ టెలిగ్రాం?" ప్రశ్నించారు వాళ్లిద్దరూ.

అదే నాకూ అర్థం కావడం లేదు.

"అడ్రను తప్పేమో?" సందేహం వెలిబుచ్చింది అమ్మ.

ఆ వీధిలోనే నా పేరుగల వ్యక్తి ఒకామెవుంది. వెంటనే అక్కడికి పరుగెత్తాను.

"నాకు నారాయడు ఎవరో తెలియదండీ. ఇది మీకే అయ్యుంటుంది" అందా ఇల్లాలు.

ఉస్సురని నిట్టూర్చాను.

నేనెప్పుడూ విశాఖపట్నం ప్రత్యేకించి వెళ్లలేదు బస్సులలోంచి, రైళ్లల్లోంచి చూడడం తప్ప.

హైద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న నాకు, దాదాపు బంధువులందరితోను సంబంధ బాంధవ్యాలు అంతగా లేవనే చెప్పాలి. అమ్మకీ నాన్నకీ మాత్రం అందరూ తెలును.

ముగ్గురు అక్కయ్యలకీ పెళ్లిళ్లయి అత్తారిళ్లకి వెళ్లిపోయారు. ఇద్దరు అన్నయ్యలు ఉద్యోగరీత్యా చాలా దూరంలో వున్నారు.

కట్నాల మార్కెట్‌లో నా పెళ్లి ఒక సమస్యగా మిగిలిపోయింది అమ్మా నాన్నలకి. నా వయసు ముప్పయికి దగ్గర పడుతోంది.

అడపాదడపా పెళ్లికొడుకులు వచ్చి చూసి పోతున్నారు.

ఆలోచనలమధ్య నిమిషాలు దొర్లిపోతున్నాయి. "ఆ వ్యక్తి నా మీద ఎంతో ఆశ పెట్టుకుని ఈ టెలిగ్రాం యిచ్చి వుండాలి! పోనీ ఓసారి వెళ్తే?

అదే అన్నాను అమ్మతో. అమ్మ గఁయ్‌మంది. ఎవడో దిక్కూమొక్కూ లేనివాడు టెలిగ్రాం ఇస్తే తగదునమ్మా అంటూ బయలుదేరుతావా? ఎవరైనా వింటే నవ్విపోగలరు! ఆ టెలిగ్రాం చింపి అవతల పారెయ్యి!

క్షణకాలం మౌనం వహించాను.

ఎందుకో నాకు విశాఖ వెళ్లాలనిపిస్తోంది! మనిషికి మనిషి సాయపడేది ఇలాంటప్పుడే!

నేను మనిషిని. నాలో మానవత్వం నిలిచివుంది. దృఢసంకల్పంతో విశాఖ బయలుదేరాను.

రెండు మూడు బస్సులు పట్టుకుంటేకాని అడ్రను దొరకలేదు. ఓ మారుమూల సందులో, ఓ చిన్న పూరి గుడిసెలో వుంటున్నాడు నారాయడు.

గుడిసెలో గుడ్డిదీపం వెలుగుతోంది.

ఆ వ్యక్తి కుక్కి నులకమంచంలో నిస్త్రాణగా పడుకుని వున్నాడు. బహుశా అతడే నారాయడై వుండాలి!

నన్ను చూసి ఒకళ్లిద్దరు ఇరుగుపొరుగు వాళ్లు వచ్చారు. "రజని అమ్మగారు అంటే మీరేనా తల్లీ? ఆడు మిమ్మల్ని గురించి ఒకటే కలవరిస్తున్నాడు!" అంది ఒకామె.

మంచం దగ్గరగా నడిచాను. గడ్డాలు మీసాలు పెరిగి వున్నాయి అతనికి. మనిషి గుర్తు పట్టలేనట్టున్నాడు.

నన్ను నేను ఏమని పరిచయం చేసుకోగలను? నేను రావడంలో అర్థం లేదనిపించింది క్షణకాలం. అంతలోనే నన్ను నేను నిందించుకొని కర్తవ్యాన్ని ఆలోచించసాగేను.

"నారాయడూ... లెగరా... నువ్వుసెప్పిన రజని అమ్మగారు వొచ్చింది!" అన్నాడు ఓ కాకీ నిక్కరు చొక్కా వేసుకున్న వ్యక్తి.

అతడొక రిక్షా కార్మికుడు.

నారాయడి గుడిసె ముందు కూడా ఓ రిక్షా నిలిచి వుంది. 'బహుశా అది నారాయడిది కాబోలు?'

ఓ మూడేళ్ల పిల్లనెత్తుకుని వచ్చింది ఓ స్త్రీ. "అమ్మగోరూ ఇది నారాయడి కూతురండీ!" అంది. ఆ పాప ముఖం చూస్తూ వుంటే గుండె దేవినట్టయ్యింది. చిన్నారి ఆ కన్నులలో దీనత్వం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. కన్నీరు చారికలై చెక్కిళ్ల మీద నిలిచిపోయాయి.

నారాయడు కళ్లు విప్పాడు.

అందరూ ఆత్రుతగా అక్కడికి పరుగెత్తారు.

నారాయడు చేతితో నాకు సైగ చేశాడు. నేను దగ్గరగా వెళ్లాను.

"అమ్మాయిగారూ వచ్చారా?" ఆ ప్రశ్న నూతిలోంచి వచ్చినట్టున్నా నాకు ఎక్కడో విన్నట్టనిపించింది. హృదయపు అట్టడుగు పొరల్నితాకి ఏ జ్ఞాపకాలలోకో తీసుకువెళ్లిపోయింది.

సందేహం లేదు. ఇతడు ఆ నారాయడు... చిన్న తాతయ్యగారి నారాయడే. మరి ఇక్కడ ఎందుకు వున్నట్టు?

"అమ్మాయిగారూ నానెల్లి పోతున్నానండీ! నా బిడ్డ... లచ్చిమి... దాన్ని... మీ... రే... సాకాలి... సేతులెత్తి దండపెడుతున్నానండీ!" అన్నాడు నారాయడు ఆయాస పడుతూ.

నారాయడుకి కేన్సర్.

ఇక ఎక్కువ సేపు బ్రతకడు. నా హృదయం ద్రవించింది. ఆ క్షణంలో నారాయడు చేతిలో చెయ్యి వెయ్యక తప్పదు. వాడి ప్రాణం ప్రశాంతంగా పోవాలి.

మౌనంగా వాడి చేతిలో చెయ్యివేశాను.

వాడి నిర్జీవమైన పెదాలమీద నవ్వు మిగిలిపోయింది. ప్రాణాలు అనంత విశ్వంలోకి కలిసిపోయాయి.

నారాయడు ఆ ఊరొచ్చి అయిదేళ్లయిందిట. బిడ్డ పుట్టగానే వాడి భార్య కన్ను మూసిందిట. అప్పటినించీ



జీవితం శాశ్వతంకాదు. ఎవరెంత ఆర్జించినా అంతిమయాత్రలో అది కూడా రాదు! చివరికి మిగిలేది మంచితనం ఒక్కటే. ఇది తెలిసీ, సాటి మనిషికి కష్టం కలిగితే, సహాయ పడడానికి అవకాశం వుండికూడా 'మనకెందుకులే' అనుకునే వారు ఎంతోమంది. ఐతే ఏటికి ఎదురీది అయినా నరే ఇతరులను కష్టాల్లో ఆదుకునేవారు కొంత మంది వుంటారు. మనుషుల మధ్య అటువంటి 'మనీషి' కనిపిస్తే, అది ఈ రోజుల్లో సంచలనాత్మక మైన విషయమే!

నారాయడే బిడ్డను పెంచుతున్నాడు. రిక్షాతొక్కి బ్రతుకు వెళ్లదీస్తున్న నారాయుడికి మహమ్మారిలా కేన్సర్ వచ్చింది.

వాడు బ్రతకడని డాక్టర్లు చెప్పినదగ్గిరనించీ బిడ్డ గురించే ఆలోచిస్తున్నాడట. ఇదంతా అక్కడివాళ్లు చెప్పారు.

నారాయడి దయనీయమైన గాథ నన్ను కలచివేసింది. నా మీద వుండే పిచ్చి నమ్మకంతో నన్ను పిలిపించాడు. కాని... కాని... నేను బిడ్డ బాధ్యత స్వీకరించగలనా? మరి నారాయడికిచ్చిన మాట?

బిడ్డ బాధ్యత పూర్తిగా నాదే అన్నట్టు అక్కడి వాళ్లందరూ మెల్లగా జారిపోయారు.

'భగవాన్! నాకేమిటీ పరీక్ష?' అనుకున్నాను.

మరునాడు తిరుగు ప్రయాణమయ్యాను బిడ్డతో సహా.

ఏమీతెలియని పావ నవ్వుతోంది హాయిగా.

నారాయడు ఎవరు? నేను ఎవరు? మనసు గతంలోకి ప్రయాణించింది.

చిన్నప్పటి నించీ నాన్నగారి బదిలీల మీద ప్రతీ ఊరూ తిరుగుతున్న నాకు చికాకుగా వుంటూ వుండేది. ప్రశాంతత అనేది లేకుండా వుండేది.

అలాంటి సమయాలలో చిన్న తాతయ్యగారి ఊరు నాకెంతగానో నచ్చింది. చిన్నతాతయ్యకి పిల్లలు లేరు. అందుచేత మమ్మల్ని ఎంతో గారాం చేస్తూవుండేవాడు.

మొదట చిన్న తాతయ్యగారింట్లో చూశాను నారాయణ్ణి. అప్పుడు వాడికి వధ్నాలుగేళ్ళుంటాయి. ఎప్పుడూ నవ్వుతూ అమాయకంగా వుండేవాడు.

"అమ్మాయిగారూ!" అంటూ పిలిచేవాడు నన్ను. నేను చక్కగా చదువుకుంటూవుంటే వాడికి ఆశ్చర్యంగా వుండేది. "అమ్మాయిగారూ నాకూ నదూకోవాల నుందండీ!" అంటూ వుండేవాడు ఎన్నోసార్లు.



"చదువుకో నారాయడూ!" అంటూ ప్రోత్సహించేదాన్ని. కొన్నాళ్ళు వలకాబలవం వట్టుకుని చదువునేర్చుకున్నాడు. రాయనూ చదవనూ నేర్చాడు త్వరలోనే.

కాని వాడి చదువు ఎక్కువ కాలం సాగలేదు. చిన్న తాతయ్యగారి పొలంవని, ఇంటివని, వశువుల నంరక్షణ వీటితో అసలు సమయమే చిక్కేదికాదు నారాయుడికి.

"అమ్మాయిగారూ లచ్చిందేవి నదూకుంటుందండీ!" అన్నాడు నారాయడు ఓ రోజు సిగ్గువడుతూ.

అప్పటికి వాడి వయస్సు వదహారేళ్ళు.

"లచ్చిందేవి ఎవరు?" అన్నాను.

"మా వెంకయ్య మావ కూతురండి రణస్థలంలో ఏడో తరగతి నదూతూందండి!" వాడి కళ్లలో అవ్యక్తమైన ఆనందం కదలాడుతోంది.

నారాయడు లచ్చిందేవిని ప్రేమిస్తున్నాడు. ఆ విషయం వాడి ప్రతీ కదలికలోనూ వ్యక్తమౌతూనేవుంది.

లచ్చిందేవి తండ్రి ఆస్తివరుడు. అంతో ఇంతో నాగరికత తెలిసినవాడు. నారాయడు వాడి చూపుకి ఆనడంలేదు.

"లచ్చిందేవీ మనం మనువాడదాం!" ఎన్నోసార్లు అడిగేడు నారాయడు లచ్చిందేవిని.

"సీ నిన్నా?" అంటూ కొట్టిపారేసింది లచ్చిందేవి ఎన్నోసార్లు.

లచ్చిందేవి మనసులో నారాయుడికి స్థానం లేదని తెలుసుకునేందుకు ఎక్కువ కాలం వట్టలేదు.

చిన్న తాతయ్యగారింట్లోనే గోపాలి వని చేస్తూవుండేది. పొట్టిగా పీలగా చింపిరి జుట్టుతో వుండేది గోపాలి. గోపాలి మనసు నిండా నారాయడి తలవులే.

గోపాలి చారమ్మ కూతురు. చారమ్మ నారాయడికి మేనత్త. "ఒరే నారాయుడూ... గోపాలిని మనువాడరా!" అంటూ వుండేది చారమ్మ.

"సీ దీన్నా? సింతకాయనాగుంది! ఇది నాకొద్దు" అంటూ వుండేవాడు నారాయడు.

గొడ్ల చావడిలో పేడలెత్తుతూ, ఇళ్లూడుస్తూ, గిన్నెలు తోముతూ నారాయడిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తూ వుండేది గోపాలి.

రోజులు దొర్లి పోతున్నాయి. నేను అడపాదడపా చిన్న తాతయ్యగారి ఊరు వెళ్తూనేవున్నాను..

నారాయుడికి లచ్చిందేవి మీద ప్రేమ వేళ్లూని మహావృక్షంలా విస్తరించుకుంది. లచ్చిందేవి హైస్కూల్ చదువు పూర్తిచేసింది.

"అమ్మాయిగారూ... నేను మీ మాటవిని నదూకునుంటే బావుండేది!"నారాయడు ఓ రోజు నాతో అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాను వాడివైపు.

"నదూరాని మొద్దూ నీకు ప్రేమొకటా?" అంటూ లచ్చిందేవి నవ్విందండమ్మాయిగారూ! "తువ్వాలు నోట్లో కుక్కుకుని ఏడ్చాడు నారాయడు.

జాలి లాంటిది కలిగింది నాలో.

ఆ మరునటి నెలలో సూరవ్వడితో లచ్చిందేవి పెళ్లి జరిగిపోయింది.

నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను.

సూరవ్వడు రెండవపెళ్లి వాడు. ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. బోల్డంత డబ్బు కూడా వుంది. 'డబ్బుకు లోకం దాసోహం!' అనుకున్నాను మనసులో.

నారాయడు దాదావు పిచ్చివాడే అయ్యాడు. గొడ్ల చావడిలో కూచుని మోకాళ్లలో తల దాచుకుని ఏడవడం నేను ఎన్నోసార్లు చూశాను.

రాయి లాంటి ఆడది లచ్చిందేవి అనుకున్నాను, ఎన్నోసార్లు.

లచ్చిందేవి మనువాడి వెళ్లిపోయిన తరువాత గోపాలి కన్నుల్లోకి వెలుగొచ్చింది. "ఒరే నారిగా ఏడుస్తూ కూకుంటే మాత్రం, ఇంకోడి సొత్తయిన లచ్చిందేవి నీదవుతాదా? గోపాలిని మనువాడు!" అంది ఒకటికి వదిసార్లు చారమ్మ.

వేదాంతిలా నవ్వి వూరుకున్నాడు నారాయడు.

కాల గర్భంలో ఏళ్లు గడిచిపోతున్నాయి. నేను కూడా పెద్ద చదువులోకి వచ్చాను. ఎప్పుడో కాని చిన్న తాతయ్యగారి ఊరు వెళ్లడానికి కుదిరేదికాదు.

లచ్చిందేవి ముగ్గురు బిడ్డల తల్లయ్యింది.

నారాయుడిలో ప్రేమ ఇసుమంతయినా తరగలేదు. పిచ్చివాడిలా తనలో తానే మాట్లాడుకుంటూ వుంటాడు. నవ్వుకుంటూ వుంటాడు.

నేను చాలాసార్లు చెప్పి చూశాను. "నారాయుడూ నీ మీదే మనసు నిలుపుకున్న గోపాలిని చేసుకో!" అంటూ.

"ఒద్దండి అమ్మాయిగారూ లచ్చిందేవి జ్ఞాపకాల్లోనే నా బతుకు ఎల్లిపోనీండి!" అన్నాడు వాడు.

మౌనం వహించాను నేను.

తరువాత నాకు చిన్న తాతయ్యగారి ఊరు వెళ్లడానికి పడలేదు. హైదరాబాద్ ఉద్యోగం, జీవితం బిజీగా తయారయ్యింది. ఈ మధ్యే చిన్న తాతయ్య మరణించినట్లు తెలిసింది.

ఇంక కొండములగాంతో మా కేం పని?

రైలు హైదరాబాద్ స్టేషన్‌లో ఆగింది.

ఒక్కసారి గతంలోంచి వర్తమానంలోకి వచ్చాను. నా ఒడిలో తల పెట్టుకుని ఆదమరచి నిద్రపోతున్న పాపని లేవతీసి ఎత్తుకున్నాను.

టాక్సీలో ఇంటికి బయలుదేరాను.

చటుక్కున నాకు స్ఫురించింది. అయితే నారాయుడు గోపాలిని పెళ్లి చేసుకున్నాడన్నమాట? పాప పేరు లచ్చిమి అంటే? లచ్చిందేవి పేరన్న మాట? నాలో నేను నవ్వుకున్నాను.

పాపని తీసుకుని ఇంట్లోకి అడుగు పెట్టాను.

అమ్మ కన్నులలో నిప్పురవ్వలు రాలాయి. "నీకిదేం పొయ్యేకాలమే? ఏ అనాధ శరణాలయంలోనైనా చేర్చలేక పోయావూ?" అంత క్రితమే నారాయుడి కథ క్లుప్తంగా చెప్పాను అమ్మా నాన్నలకి.

"రజనీ బాగా ఆలోచించే చేశావా ఈ పని?" నాన్న నెమ్మదిగా ప్రశ్నించారు.

నవ్వాను నేను.

"అమ్మా... పాప ఇక నుంచీ మనతోటే వుంటుంది!" అన్నాను దృఢంగా.

"రజనీ దారినపోయే దరిద్రాన్ని ఎవరు నెత్తిన వేసుకుంటారు? పైగా పెళ్లి కావలసిన దానివి!"

"అయితే ఒక అమాయకుడు నాకు అప్పచెప్పిన బాధ్యతని విస్మరించమంటావా అమ్మా?"

"'వాడికీ మనకీ ఏమిటి సంబంధం!"

"మనిషికీ మనిషికీ వున్న సంబంధం..."

అమ్మ సణుగుతూనే వుంది. అయినా నా నిర్ణయం మారదు. నేను అవివాహితగా మిగిలిపోయినా ఫరవాలేదు. మానవత్వానికీ మనుగడకి మధ్య పోరాటం సాగుతోంది నాలో.


అమ్మ ప్రవర్తనలో మార్పులేదు.

ఆమె పాతకాలానికి ప్రతినిధి.

నేను తీసుకున్న నిర్ణయం ఆమె అంతరంగాన్ని దెబ్బ తీసింది. ఇందులో ఓ గమ్మత్తుంది.

నారాయుడు హరిజనుడు. □

## వాణిజ్యరంగంలో వనిత:



## జీనియా లాయర్

'పెళ్ళి చేసుకుని హాయిగా ఇంటిపట్టున ఉండి కాపురం చేసుకుంటాను' అనుకుని పెళ్ళి చేసుకుంది ఆమె. హాయిగా కాపురం కూడా చేసుకుంటున్నది. అయితే ఇంటి పట్టున ఉండడం మాత్రం సాధ్యం కాలేదు.

దాంతో–తన ఇరవైరెండవ యేట పెళ్ళి చేసుకున్న జీనియా లాయర్ బహుపాత్రాభినయాలు చెయ్యవలసి వచ్చింది. "నా ఏడేళ్ళ వైవాహిక జీవితంలో నేను ఒక పాత్ర నుంచి ఇంకొక పాత్రలోకి మారుతూ-అన్ని పాత్రలకూ న్యాయం చేకూర్చడానికి ప్రయత్నిస్తూ వచ్చాను," అంటారు ఆమె. ఆ ప్రయత్నాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

బీర్ తయారు చేసే సంస్థలలో అగ్రశేణికి చెందిన అసోసియేటెడ్ బ్రూయరీస్‌కు మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ఉన్న శ్రీమతి జీనియా లాయర్‌కు వ్యాపారం కొత్తకాదు. తండ్రి నోషిర్ ఇరానీకి మగపిల్లలు లేకపోవడంతో ఆయన వ్యాపార బాధ్యతలు చూసుకోవలసిన బాధ్యత ఆమెపై పడింది.

పెళ్ళి చేసుకోగానే భర్త ప్రోత్సహించడంతో ఆమె బీర్ వ్యాపారరంగంలోకి అడుగు పెట్టింది. అలా ప్రపంచం మొత్తం మీద మద్యపానీయాల వ్యాపారం నిర్వహిస్తున్న చాలా తక్కువమంది స్త్రీలలో ఆమె కూడా ఒకరయ్యారు.

ఇంటగెలిచి రచ్చగెలుద్దామన్న ఉద్దేశంతో జీనియా తమ బీర్ వ్యాపారాన్ని బొంబాయి నగరంలో కేంద్రీకరించారు. ఇవాళ బొంబాయి నగరంలో అమ్ముడుపోయే బీర్‌లో సగభాగం జీనియా లాయర్ సంస్థ నుంచి వచ్చేదే.

"అనవసరమైన బొజ్జ, నడుము తగ్గాలనుకునేవాళ్ళకూ, సన్నబడాలనుకునేవాళ్ళకూ పనికివచ్చే ఒకరకం బీర్‌ను మేము తయారు చేశాము. ఒక్క బొంబాయిలోనే కాక తక్కిన నగరాలలో కూడా ఈ బీరుకు గిరాకీ ఉంది. విదేశాలవారు కూడా దీని గురించి ఆసక్తి చూపిస్తున్నారు," అన్నారు జీనియా. అంతర్జాతీయంగా బీర్‌కు నిర్ణయించిన స్థాయికి ఏమాత్రమూ తీసిపోని ఈ బీర్-ఒకరకంగా చూస్తే కొత్త ఆవిష్కరణ" అన్నారు ఆమె.

శ్రీమతి జీనియా లాయర్‌కు ఐదేళ్ళ కూతురు, ఏడాది నిండిన కొడుకు ఉన్నారు. "పిల్లల అవసరాల దృష్ట్యా త్వరగానే ఇల్లు చేరుకుని, వాళ్ళను చూసుకుంటుంటాను" అన్నారు ఆమె.

"ఆరోగ్యంగా ఉంటే తప్ప ఇటు సంసారాన్నీ అటు వ్యాపారాన్నీ చూసుకోవడం కష్టం!" అంటుంటారు జీనియా. నాట్యం చెయ్యడం, ఎక్కువ దూరం నడవడం వంటివి చేసి, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నామంటారు ఆమె.

పురుషులకే ప్రత్యేకం అనుకునేరంగంలో తమదంటూ ఒక స్థానాన్ని సంపాయించడానికి జీనియా లాయర్ అలా ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు!

['డైరెక్టర్ డైజెస్ట్' సౌజన్యంతో]